క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లి రూరల్ : తాడేపల్లి పట్టణ, రూరల్ ప్రాంతాల పరిధిలో పలు చోట్ల శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ డీఈ అక్కుల సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంస్థాగత మరమ్మతుల నిమిత్తం తాడేపల్లి పట్టణ పరిధిలోని విజయవాడ క్లబ్ రోడ్, కరకట్ట ప్రాంతాల్లో ఉదయం 11 – సాయంత్రం 4 గంటల వరకు, అంబేడ్కర్ కాలనీలో ఉదయం 10 – మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్తు సరఫరా ఉండదన్నారు. ముగ్గురోడ్డు, సాయినగర్, ఉండవల్లి సెంటర్, రామకృష్ణ హాల్ ప్రాంతం, ఈఎస్‌ఐ హాస్పిటల్ ప్రాంతాల్లో ఉదయం 9 – మధ్యాహ్నం 1 గంట వరకు, కుంచనపల్లి గ్రామంలో ఉదయం 10 – మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

క్రమశిక్షణతో ఉద్యోగులకు గుర్తింపు



ఫిరంగిపురం: ఉద్యోగ నిర్వహణలో క్రమశిక్షణ కలిగిన వారికి మంచి గుర్తింపు ఉంటుందని... ఏఎస్‌ఐ మోహన్‌రావు అదే కోవకు చెందుతారని ఎస్‌ఐ సదాశివరావు అన్నారు. మండల కేంద్రంలోని స్థానిక పోలీసు స్టేషన్‌లో ఏఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న మోహన్‌రావు పదవీ విరమణ సందర్భంగా అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ సదాశివరావు మాట్లాడుతూ బాధ్యతలు నిర్వర్తించిన ప్రతిచోట మాట పడకుండా మోహన్‌రావు పని చేశారని చెప్పారు. అనంతరం మోహన్‌రావు దంపతులను పోలీసు సిబ్బంది శాలువా, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రైటర్ దాసు, ఏఎస్‌ఐ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

గేదెల చోరీ కేసులో మైనర్ సహా నలుగురి అరెస్టు

తాడికొండ: తుళ్ళూరు మండలంలో జరిగిన గేదెల దొంగతనం కేసులో ఒక మైనర్ సహా నలుగుర్ని అరెస్టు చేసినట్లు తుళ్ళూరు ఎస్‌ఐ వేణుగోపాల్ తెలిపారు. దర్యాప్తులో అనంతరం అమరావతి మండలం కర్లపూడి గ్రామానికి చెందిన తేలుకుట్ల గోపి, మేడా వెంకటేష్, అంగర లక్ష్మీనారాయణ, ఓ బాలుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆయన పేర్కొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



తాడికొండ: అమరావతికి భూములిచ్చిన రైతులకు వార్షిక కౌలు 5 సంవత్సరాలు పెంచుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని హర్షిస్తూ తుళ్ళూరులో అమరావతి రైతులు సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అమరావతి దీక్షా శిబిరం వద్ద కార్యక్రమం అనంతరం పలువురు మాట్లాడుతూ.. ఏపీ రాజధానిగా అమరావతిని నిర్మించడం గొప్ప నిర్ణయం అన్నారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని వార్షిక కౌలు పెంచేలా సీఎం తీసుకున్న నిర్ణయంతో అందరూ హర్షిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, రైతులు, రైతు కూలీలు పాల్గొన్నారు.

ప్రణాళికతో సిద్ధమైతే పోటీ పరీక్షల్లో విజయం

నెహ్రూనగర్: పోటీ పరీక్షలకు అభ్యర్థులు ప్రణాళిక ప్రకారం సిద్ధమైతే విజయం సాధించవచ్చని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. రాజాగారితోటలోని ఏపీ బీసీ స్టడీ సర్కిల్‌లో గ్రూప్ 2 మెయిన్స్ పరీక్షకు ఉచిత శిక్షణకు హాజరవుతున్న అభ్యర్థులకు బి. మల్లికార్జునరావు(రిటైర్డ్ హిస్టరీ లెక్చరర్) తయారు చేసిన ఆంధ్రప్రదేశ్ చరిత్ర స్టడీ మెటీరియల్ ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిర్దేశిత సిలబస్ చదివాక, ఆయా సబ్జెక్టులకు సంబంధించిన తెలుగు అకాడమీ ఇతర ప్రామాణిక పుస్తకాలను కూడా చదవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్టడీ సర్కిల్ డైరెక్టర్ డి. మధుసూదనరావు, హిస్టరీ ఫ్యాకల్టీ రఫీ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఆర్డీకి వినతి

గుంటూరు మెడికల్: మెడికల్ అండ్ హెల్త్ రీజినల్ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ సుచిత్రను ఏపీ హంస అసోసియేషన్ గుంటూరు జిల్లా , గుంటూరు సిటీ యూనిట్ ప్రతినిధులు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. వైద్యశాఖలో పనిచేస్తున్న ఉద్యోగులకు త్వరగా ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. జీవో 143 ద్వారా సర్దుబాటు చేసిన వారి జీతాల సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలన్నారు. అందరికీ న్యాయం చేకూరేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తర్వాత జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కొర్రా విజయలక్ష్మిని కలిశారు. రెగ్యులర్ అయిన కొంత మంది ఎంపీహెచ్‌ఏ సిబ్బందికి జీతాల సమస్య ఉందని చెప్పారు. దానిని పరిష్కరించాలని నేతలు కోరారు.

పూడికతీత.. నత్తనడక!

- నామమాత్రంగా చెత్త తొలగింపునకే సిబ్బంది పరిమితం
- పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యంతో సీజనల్ వ్యాధుల విజృంభణ
- ప్రజల కష్టాలను పట్టించుకోని పాలకులు, అధికారులు

మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. ఇక మురుగు కాలువల్లో పూడికతీత పనుల వేగం నత్తను తలపిస్తోంది. ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అటు పాలకులు, ఇటు అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.



మురుగు కాల్వలోని పూడికను తీసి రోడ్డు పక్కన వదిలేసిన దృశ్యం



రోడ్లపై సంచరిస్తున్న పశువులు

మంగళగిరి : రాష్ట్రంలోనే రెండో అతి పెద్ద విస్తీర్ణం కలిగిన కార్పొరేషన్‌గా అవతరించిన ఎంటీఎంసీ శరవేగంగా విస్తరిస్తోంది. మంగళగిరి తాడేపల్లి మున్సిపాలిటీలతోపాటు విలీన 21 గ్రామాలలో కొద్ది రోజులుగా పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. మరోవైపు పట్టణంలో రహదారులపై పశులులు అడ్డగోలుగా తిరుగుతూ ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ప్రధాన రహదారి గౌతమబుద్ధ రోడ్డుతోపాటు పలు ఇతర రోడ్లపై ఇదే పరిస్థితి నిత్యం కనిపిస్తోంది. మరోవైపు మురుగు కాలవలలో పూడికతీత నామమాత్రంగా చేస్తున్నారు. ఎప్పటికపుడు వ్యర్థాలు తొలగించకపోవడంతో అవి రోడ్డుపైనే పేరుకుపోతున్నాయి. వర్షాకాలం కావడంతో ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడుతున్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన కమిషనర్ అలీంబాషా క్షేత్రస్థాయిలో పరిస్థితులపై దృష్టి సారించాల్సిన అవసరముంది. ట్రాఫిక్ నియంత్రణలో అధికారుల నిర్లక్ష్యం కనిపిస్తోంది. ఎంటీఎంసీగా అవతరించిన నగరం విస్తరించాలంటే ప్రధానంగా రోడ్ల విస్తరణ అవసరమని భావించిన మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) తన హయాంలో రూ.23 కోట్లతో గౌతమబుద్ధ రోడ్డును 150 అడుగుల మేరకు విస్తరించారు. ట్రాఫిక్ సలహా బోర్డు సూచనలతో డివైడర్‌లు పెట్టలేదు. నడక దారులు ఏర్పాటు చేశారు. నేడు అధికారులు డివైడర్ ఏర్పాటు చేయడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాహనచోదకులు వాపోతున్నారు. కొంత మంది వ్యాపారుల కోసం డివైడర్‌లు ఏర్పాటు చేసి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారనే విమర్శలున్నాయి.

మురికి కూపాలుగా ఖాళీ స్థలాలు

ఎంటీఎంసీ పరిధిలో 870కుపైగా ఖాళీ స్థలాలను గుర్తించారు. అవి మురికి కూపాలుగా మారి ప్రజల ఆరోగ్యానికి చేటు తెస్తున్నాయి. వర్షాకాలంలో ఈ స్థలాల్లో చేరే నీటితో దోమలు ప్రబలి మలేరియా, డెంగీ వంటి సీజనల్ వ్యాధులు వస్తున్నాయి. ఖాళీ స్థలాలను శుభ్రపరచుకునేలా మున్సిపల్ అధికారులు ఆయా యజమానులకు నోటీసులు జారీ చేయాలి. లేదంటే మురుగు నీరు నిల్వకుండా చర్యలు చేపట్టి, యాజమానులతో చట్టప్రకారం వ్యవహరించాలి. వారిపై భారీగా జరిమానాలు విధించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రత్యేక దృష్టి సారించాం

నేను బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాను. ప్రతి రోజు వార్డులలో పర్యటించి ప్రత్యేక చర్యలు చేపట్టా. ప్రధానంగా పారిశుద్ధ్యం పైనే దృష్టి ఉంది. ట్రాఫిక్ నియంత్రణకు కూడా తగిన చర్యలు చేపట్టాను. పశువుల యజమానులను ఇప్పటికే అనేకసార్లు నోటీసులు జారీ చేశాం. స్పందించకపోతే చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం. ప్రజలు ఏమైనా సూచనలు ఉంటే చేయొచ్చు. అమలుకు మా వంతు ప్రయత్నం చేస్తాం .

– అలీంబాషా, నగర కమిషనర్

టీడీపీ నేతల బెదిరింపుల పర్వం



హెచ్‌ఎంతో చర్చిస్తున్న వంట ఏజెన్సీ నిర్వాహకురాలు, స్థానికులు



పాఠశాల ఎదుట ఆందోళన చేస్తున్న దృశ్యం

- వంట ఏజెన్సీ నిర్వాహకురాలి తొలగింపునకు ఒత్తిడి
- బడిలో చిన్నారులకు అందని మధ్యాహ్న భోజనం
- తల్లిదండ్రులు, స్థానికుల ఆందోళనతో సదరు నేత వెనుకడుగు

బడేపురం(తాడికొండ): ''మా ప్రభుత్వం వచ్చింది. మీరు వంట ఏజెన్సీ బాధ్యతల నుంచి తప్పుకోండి. మా మనిషిని పెట్టుకుంటాం..'' అంటూ తాడికొండ మండలం బడేపురం గ్రామంలో టీడీపీ నాయకుడు బెదిరింపులకు దిగిన ఘటన జరిగింది. తన అనుచరులకు వంట ఏజెన్సీ బాధ్యతలు ఇప్పించేందుకు ఆ నాయకుడు కొద్దిరోజులుగా నిత్యం ఫోన్ చేసి బెదిరిస్తున్నాడని ఏజెన్సీ నిర్వాహకురాలు విజయ ఆవేదన వ్యక్తం చేసింది. 25 సంవత్సరాలుగా తాను ఉచితంగా వంట చేస్తున్నానని, వైఎస్సార్ సీపీకి అనుకూలమనే నెపంతో తొలగించేందుకు చూస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తాను వైదొలగబోనని ఆమె చెప్పడంతో హెచ్‌ఎంపై ఒత్తిడి తెచ్చి సదరు నాయకుడు గురువారం నుంచి ఆమెను నిలిపి వేయించాడు. దీంతో చిన్నారులు మధ్యాహ్న భోజనం లేకుండానే పస్తులుండాల్సి వచ్చింది. విషయం తెలుసుకుని ఆగ్రహించిన తల్లిదండ్రులు, స్థానికులు పాఠశాల వద్దకు వచ్చి ఆందోళనకు దిగారు. దీనిపై మాట్లాడాలని సదరు టీడీపీ నాయకుడికి ఫోన్‌లు చేశారు. దీంతో అక్కడికి రావాల్సిన అవసరం తనకు లేదని, ఏమైనా కావాలంటే ఎమ్మెల్యే కార్యాలయానికి వెళ్లి మాట్లాడుకోవాలని ముఖం చాటేశాడు. అందరూ కలిసి హెచ్‌ఎంను ప్రశ్నించడంతో పై నుంచి ఒత్తిడి ఉందని చెప్పారు. అందరి నిర్ణయానికి తాను కట్టుబడి ఉంటానన్నారు. వంట విజయ వండేందుకు తనకు అభ్యంతరం లేదని తెలిపారు. 8వ తేదీన పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నిక అనంతరం దీనిపై నిర్ణయం తీసుకుంటారన్నారు. అవసరమైన బియ్యం, వస్తువులు అందజేయడంతో చిన్నారుల ఆకలి తీరింది. రాజకీయ ఒత్తిళ్లు చేస్తూ తాడికొండలో చిరు ఉద్యోగులపై పడటం టీడీపీ నాయకులకు పరిపాటిగా మారింది. తాడికొండలో ఓ సీనియర్ నాయకుడి ఇంటిలో భేటీ అయి ఇలాంటివన్నీ పక్కాగా ప్లాన్ చేస్తున్నారు. ఇప్పటికే తాడికొండలో వీవోఏ విషయంలోనూ ఇదే తరహాలో పక్కకు తప్పించారు. పంచాయతీ దుకాణ సముదాయంలో 4 దుకాణాలకు తాళాలు వేసి తమ వారికి అప్పగించేందుకు ప్రయత్నించడంతో స్థానికుల ఒత్తిడి మేరకు మూడు దుకాణాలకు అద్దెలు చెల్లించి కొనసాగించారు. ఓ దుకాణాన్ని మాత్రం ఎలాంటి వేలం నిర్వహించకుండా రికార్డుల్లో మాత్రమే చూపించి తన అనుచరుడికి సీనియర్ నాయకుడు కట్టబెట్టాడు. ఇప్పటికే తాడికొండ– బడేపురం ప్రధాన రహదారి వెంట డబుల్ రిజిస్ట్రేషన్ చేసిన స్థలాన్ని టీడీపీ నాయకులతో దున్నించి కంచె వేయించిన సదరు నాయకుడు... నిబంధనలకు విరుద్ధగా నిర్మించడంతో కోర్టు వివాదంలో చిక్కుకున్న దుకాణాలను కూడా తెరిపించాలని పంచాయతీ అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. దీంతో అధికారులు ఇబ్బంది పడుతున్నారు. పంచాయతీ పాలకవర్గాన్ని కూడా తన కనుసన్నల్లోకి తెచ్చుకునేందుకు ఇప్పటికే ఆ నేత ప్రయత్నాలు ప్రారంభించాడు. టీడీపీ నాయకుల అడ్డగోలు పనులపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే చెప్పారంటూ ఇవన్నీ చేస్తుండటం గమనార్హం. ప్రజా వ్యతిరేక విధానాలతో ముందుకెళుతున్న వీరి ఆగడాలపై అందరికీ సేవలందిస్తానని పదే పదే చెబుతున్న ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ ఎలా స్పందిస్తారో వేచి చూడాల్సిందే.

గుంతల రోడ్డు.. పర్యాటకుల పాట్లు

కొండవీడు రహదారిలో తరచూ ప్రమాదాలు



నడిచేందుకు కూడా వీలు లేని కొండవీడు మార్గం

ఫిరంగిపురం: మండల కేంద్రం నుంచి కొండవీడు వెళ్లే రహదారి పూర్తిగా దెబ్బతింది. రోడ్డు పొడవునా గుంతలు ఏర్పడి ఏ కొద్దిపాటి వర్షం పడినా గుంతల్లో నీరు నిలుస్తోంది. కనీసం నడిచేందుకు వీలు లేని పరిస్థితి నెలకొంది. వాహనదారులు ఈ రోడ్డులో ప్రయాణించాలంటే తీవ్ర ఇబ్బంది పడాల్సిన పరిస్థితి. ఎన్నో ఏళ్లుగా ఈ రోడ్డు కనీస మరమ్మతులు నోచుకోలేదు. ఆర్ అండ్ బీ శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో వాహనదారుల ఇక్కట్లు అన్నీ ఇన్నీ కావు. ఫిరంగిపురం – కొండవీడు మధ్య సుమారు 5 కిలోమీటర్లు పొడవునా ఇదే తరహాలో గుంతలు ఉన్నాయి. వాహనదారులు రాత్రి సమయాల్లో ఎక్కువగా ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి నెలకొందని వాహనదారులు వాపోతున్నారు. మరోవైపు నిత్యం కొండవీడు కోటను, హౌస్ గణేష్ గ్రామ సరిహద్దుల్లోని రెడ్డిరాజుల మ్యూజియాన్ని చూసేందుకు పర్యాటకులు వస్తుంటారు. శని, ఆదివారాలలో వీరి సంఖ్య వందల్లో ఉంటుంది. కొన్ని సార్లు సమీపంలో తోటలు ఉండటంతో వనభోజనాలు అంటూ ఎక్కువ మంది ప్రజలు వస్తుంటారు. వాహన రద్దీ కూడా ఏర్పడుతుంది. రహదారిపై గుంతలతో ఇబ్బంది పడాల్సి వస్తోంది. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అనుచిత వ్యాఖ్యలు చేయకుండా చూడాలి

గుంటూరు మెడికల్ : ఏఎన్‌ఎంలపై అధికారులు అనుచిత వ్యాఖ్యలు చేయకుండా చూడాలని కలెక్టర్ నాగలక్ష్మిని ఏపీఎన్‌జీఓ నేతలు కోరారు. ఏపీఎన్‌జీఓ గుంటూరు జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు, కార్యదర్శి శెట్టిపల్లి సతీష్ కుమార్‌లు శుక్రవారం జిల్లా కలెక్టర్ నాగలక్ష్మిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల ఏఎన్‌ఎంలను ఉద్దేశించి ఒక ఎంపీడీవో చేసిన వ్యాఖ్యలు అనుచితమని ఫిర్యాదు చేశారు. ఏఎన్‌ఎంలు నిత్యం పలు యాప్‌లతో పాటు వివిధ వైద్య సేవలు అందిస్తున్నారని గుర్తుచేశారు. వారిపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం తగదని పేర్కొన్నారు. గతంలో మెడికల్ అండ్ హెల్త్ కమిషనర్ కూడా ఏఎన్‌ఎంలకు ఇతర డ్యూటీలు వేయవద్దని ఉత్తర్వు ఇచ్చారని గుర్తుచేశారు. అయినా పెన్షన్లు పంపిణీకి వారి సేవలను వినియోగిస్తున్నారని వెల్లడించారు. వారు వేకువజామున ఈ పంపిణీ కార్యక్రమానికి హాజరవ్వటం ఇబ్బందికరమని తెలిపారు. అధికారులకు తగు సూచనలు ఇస్తానని తెలిపినట్లు యూనియన్ నేతలు వెల్లడించారు.

ఇంజినీరింగ్ విద్యార్థులకు అవగాహన సదస్సు



మాట్లాడుతున్న సీఐ జయకుమార్

మేడికొండూరు : మండలంలోని యూనివర్సల్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన సదస్సు జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేడికొండూరు సీఐ దార్ల జయకుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో విద్య అభ్యసించాలన్నారు. లక్ష్యాన్ని ఎంచుకుని పట్టుదలతో సాధించాలని కోరారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. కళాశాల సెక్రటరీ ఫాదర్ పి.బాలస్వామి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి లక్ష్యం దిశగా ఇష్టంతో చదివి ముందుకు సాగాలని సూచించారు. సమస్యలు ఉంటే పరిష్కరించుకునే ప్రయత్నం చేయాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సి.హెచ్.కేశవరెడ్డి, ఎస్సై చల్లా వాసు, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ రమేష్, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ మర్రెడ్డి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు హర్షణీయం



మేడికొండూరు :ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై డోకిపర్రు శాంతిపాలెం ఎస్సీ కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం రాత్రి అభినందన కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా టీడీపీ రాష్ట్ర మహిళ నాయకురాలు ఇ.రత్నకుమారి పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ.. ఎస్సీ కులాలకు సమాన న్యాయం జరిగేలా సుప్రీంకోర్టు తీర్పు ఉందన్నారు. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి గత రెండున్నర దశాబ్దాలుగా మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఎన్నో ఉద్యమాలు నిర్వహించిన ఫలితం ఇదన్నారు. కార్యక్రమంలో పేరేచర్ల గ్రామ సర్పంచి దేవరకొండ రాజ్‌కుమార్, ఎమ్మార్పీఎస్ నాయకులు ఎం.జక్రయ్య, డి.నాని గోపీచంద్, బీర్ల శివ, అరవింద్, తదితరులు పాల్గొన్నారు.

నేరాల నివారణకు ముమ్మరంగా తనిఖీలు



మాట్లాడుతున్న గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

తాడేపల్లి రూరల్: నేరాలను అరికట్టడంతోపాటు ప్రమాదాల నివారణే లక్ష్యంగా ముమ్మరంగా వాహన తనిఖీలు నిర్వహిస్తున్నట్లు గుంటూరు జిల్లా ఎస్పీ ఎస్. సతీష్‌కుమార్ అన్నారు. శుక్రవారం మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని ఐదు చోట్ల వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పరిశీలించడానికి వచ్చిన ఎస్. సతీష్‌కుమార్ మాట్లాడుతూ.. చాలామంది యువకులు రాష్ డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నారని గుర్తుచేశారు. వీటితోపాటు నేరాలను నివారించేందుకు మంగళగిరి సబ్‌డివిజన్ పరిధిలోని మంగళగిరిలోని ఆల్ఫా సెంటర్, వడ్లపూడి సెంటర్, ఆర్ అండ్ బీ బంగ్లా, తాడేపల్లి పరిధిలోని ప్రకాశం బ్యారేజ్ ప్రాంతం, ఓల్డ్ టోల్‌గేట్ వద్ద ఏక కాలంలో తనిఖీలు నిర్వహించామని చెప్పారు. ఇప్పటికే చాలా వాహనాల యజమానులపై కేసులు నమోదు చేశామని తెలిపారు. మంగళగిరి సబ్ డివిజన్‌లోని సీఐలు, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నట్లు ఆయన పేర్కొన్నారు.

ర్యాష్ డ్రైవింగ్ చేసేవారిపై కఠిన చర్యలు

మంగళగిరి: గుంటూరు జిల్లాలో ర్యాష్ డ్రైవింగ్ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఎంటీఎంసీ పరిధిలోని పలు కూడళ్లలో వాహన తనిఖీలు నిర్వహించారు. ఎస్పీ ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రత్యేకంగా విద్యార్థినులకు సంబంధించి విద్యాసంస్థల వద్ద తనిఖీలు ముమ్మరం చేసినట్లు తెలిపారు. మైనర్‌లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తామన్నారు. కార్యక్రమంలో నార్త్ జోన్ డీఎస్పీ రవికాంత్, పట్టణ సీఐ వినోద్ కుమార్, రూరల్ సీఐ శ్రీనివాసరావు, ఎస్‌ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య శిబిరాల ఏర్పాటుకు వినతి



గ్రామ కార్యదర్శి భవానికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

తాడేపల్లి రూరల్ : దుగ్గిరాల మండల పరిధిలోని గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని కోరుతూ సీపీఎం మండల కార్యదర్శి జెట్టి బాలరాజు కోరారు. ఈ మేరకు తుమ్మపూడి గ్రామ కార్యదర్శి భవానికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత నెల రోజులుగా వైరల్ జ్వరాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే పలు గ్రామాల్లో డెంగీ వ్యాధి లక్షణాలు ఎక్కువ మందిలో కనిపిస్తున్నట్లు చెప్పారు. అధికారులు స్పందించి వెంటనే వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం గ్రామ కార్యదర్శి ఎం. నరసింహారావు, బి. చిరంజీవి, ఎం. శ్రీనివాసరావు, కె.శ్రీకాంత్, శ్రీను, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ధ్వంసం చేసిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు



ధ్వంసం చేసిన రహదారి ఇదే..

మంగళగిరి : మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కాజలో రైతుల కోసం వేసిన రోడ్డును రియల్ ఎస్టేట్ వ్యాపారులు ధ్వంసం చేసి అక్కసు తీర్చుకున్నారు. కాజలో ఓ వెంచర్ వేసిన రియల్ ఎస్టేట్ నిర్వాహకులు పక్కన ఉన్న ప్రభుత్వ భూమి కాలువలు, కట్టలు ఆక్రమించినట్లు ఆరోపణలు ఉన్నాయి. అటుగా ఉన్న తమ భూములకు రైతులు వెళ్లేలా వెంచర్ వెంట ప్రభుత్వ రోడ్డు ఉంది. పొలాల్లోకి వెళ్లే రైతులు ఆ మార్గాన్ని వినియోగించుకుంటున్నారు. రైతులకు పొలాలకు వెళ్లడానికి దూరం తగ్గడంతోపాటు వారు అటుగా నిత్యం ఎద్దులు, ట్రాక్టర్లు తీసుకెళ్తున్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు దీన్ని సహించలేక శుక్రవారం రోడ్డును ధ్వంసం చేశారు. రూ.13 లక్షలతో వేసిన రోడ్డును ఇలా చేయడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకుని ప్రజధనాన్ని రికవరీ చేయడంతోపాటు రోడ్డు కూడా మళ్లీ నిర్మించాలని రైతులు కోరుతున్నారు. దీనిపై వివరణ కోరేందుకు ప్రయత్నించినా నగర కమిషనర్, ఇంజినీరింగ్ అధికారులు స్పందించకపోవడం గమనార్హం.

జ్వర బాధితుల గుర్తింపునకు సర్వే



స్థానికులను అడిగి వివరాలు తెలుసుకుంటున్న వైద్యులు

తాడేపల్లి రూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని తుమ్మపూడి గ్రామంలో జ్వరాలు విజృంభించడంతో బాధితుల గుర్తింపునకు ఇంటింటి సర్వే చేపట్టారు. దుగ్గిరాల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ కేంద్ర వైద్యులు డాక్టర్ అబ్దుల్ రహమాన్ మాట్లాడుతూ... తుమ్మపూడిలో జ్వరాలు అధికంగా ఉండడంతో సర్వే చేశామన్నారు. జ్వరాలు వచ్చిన వారితో పాటు ఇతరులకు కూడా డెంగీ, మలేరియా తదితర పరీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇప్పటి వరకు ఒక్క కేసు కూడా కనిపించలేదని పేర్కొన్నారు. స్థానికులు సీజన్ మారడంతో అనారోగ్యం బారిన పడ్డారని తెలిపారు. వారికి ఒళ్లు నొప్పులు అధికంగా ఉండటంతో మందులు అందజేశామని వివరించారు. పరీక్షలు చేయించుకోవాలని భావించేవారు దుగ్గిరాల పీహెచ్‌సీకి రావచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఇందిర, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు, హెల్త్ సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాల ప్రతికూలతలపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి

గుంటూరు మెడికల్ : వ్యాధి నిరోధక టీకాల అనంతరం సంభవించే ప్రతికూల ప్రభావాలపై డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏఈఎఫ్‌ఐ కేసులు రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై కమిటీ సభ్యులతో తన చాంబరులో చర్చించారు. అనుమానాస్పద కేసులు నమోదైతే వెంటనే వైద్యాధికారి దృష్టికి తీసుకొని వెళ్లి తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు డాక్టర్ కె.వి. సుబ్బరాజు, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ బి.దేవకుమార్, హెచ్‌ఓడీ పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ జి. భవాని, సర్వైలెన్స్ మెడికల్ ఆఫీసర్ డబ్ల్యూహెచ్‌ఓ డాక్టర్ ఎం.రమేష్ బాబు, డాక్టర్ బి.శివగోపాల్, డాక్టర్ టి.భారత్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్. హర్షద్ యాదవ్, డాక్టర్ ఎస్. వసుంధర, వైద్యాధికారులు పాల్గొన్నారు.

డీఎంహెచ్‌ఓను కలిసిన బీజేపీ నేతలు

గుంటూరు మెడికల్ : ప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ కార్డుల జారీ ప్రక్రియను అందుబాటులోకి తీసుకురావాలని బీజేపీ నేతలు శుక్రవారం డీఎంహెచ్‌ఓ కొర్రా విజయలక్ష్మిని కలిసి వినతి పత్రం అందజేశారు. ప్రజలకు అందించని కార్డులను తక్షణమే పంపిణీ చేయాలని కోరారు. విజయలక్ష్మి స్పందిస్తూ పరిశీలించి కార్డులను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. కేవైసీ పెండింగ్‌లో ఉన్న వాటిని గ్రామ, పట్టణ స్థాయిలో సత్వరమే పూర్తి చేస్తామన్నారు. డీఎంహెచ్‌ఓను కలిసిన వారిలో బీజేపీ తెనాలి అసెంబ్లీ కన్వీనర్ కటారి వాసుదేవ నాయుడు, తెనాలి మండల ప్రెసిడెంట్ కడియాలనంద కిషోర్, వై.కామేశ్వరరావు, కొవ్వూరి శ్రీను తదితరులు ఉన్నారు.